ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -117 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 27 మే 2026

# రైతుల ముంగిటకే మార్కెట్..

## ‘ఫార్మ్ టు హోమ్’

రైతు ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చే 'ఫార్మ్ టు హోమ్' విధానం


యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటుకు పరిశీలన

జూలైలో అగ్రికల్చర్ స్కూల్‌కు శంకుస్థాపన

రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు

**అమరావతిమే 26ఆంధ్ర ప్రగతి**

రాష్ట్ర వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటలను, ముఖ్యంగా కూరగాయలు, పండ్లను నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేర్చేందుకు 'ఫార్మ్ టు హోమ్‘ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫ్రీూాం) ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. **మిగతా 2లో...**



### ఆక్వా రైతులకు భారీ ఊరట

వ్యవసాయం, అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ

అధికారులకు కీలక ఆదేశాలు

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

### ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,ఆంధ్ర ప్రగతి**

అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా **మిగతా 2లో...**






## నేటినుంచి టిడిపి మహానాడు

వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ

పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**అమరావతిమే 26ఆంధ్ర ప్రగతి**

టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో

ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో **మిగతా 2,5 లో...**

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ఆన్లైన్ పన్నుల వసూళ్లతో విధానంతో పారదర్శకత పెరుగుతుంది

ఆన్లైన్ పన్నుల విధానాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్

**రాజమండ్రి మే 26(రిపబ్లిక్ న్యూస్):**

'సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీ పన్నుల వసూలు ప్రక్రియ సరికొత్త మార్గంలో ముందుకు వెళ్లడం శుభపరిణామం’ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో మాన్యువల్ పద్ధతిలో పన్ను వసూళ్లు ఉండేవని, దీన్ని పూర్తిగా మార్చి మొత్తం ఆన్లైన్ విధానం తీసుకు వచ్చామని చెప్పారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులు మంగళవారం స్వయంగా పరిశీలించారు. **మిగతా 2లో...**



# ఈడీ విచారణకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్య, కుమారుడు

లిక్కర్ స్కామ్ లో విచారణ వేగవంతం చేసిన ఈడీ

ఈడీ అధికారులకు తమ ఆస్తుల వివరాలను అందించామన్న మోహిత్ రెడ్డి

తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమేనని వ్యాఖ్య


2లో.

## శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..

ప్రధాని మోదీతో తన అనుభవాలపై ‘అప్నాపన్‘ పేరుతో రచన

ఢిల్లీలో జరిగిన ఈ వేడుకకు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్

మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ

కార్యక్రమంలో పలువురు జాతీయ నేతలను కలిసిన లోకేశ్


2లో.

# పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు

రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు

జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం

పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ



**హైదరాబాద్ మే 26ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, **మిగతా 2లో...**

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

అనుమతిచ్చిన కోర్టు

నేడు చర్లపల్లి జైలునుంచి సిట్ కార్యాలయానికి తరలింపు విచారించనున్న బృందం


2లో.

# రైతుల ముంగిటకే మార్కెట్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, ప్రాంతాల వారీగా పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, ఈ విధానంలో విజయం సాధించిన రైతుల అనుభవాలను వినియోగించుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్నచోట్ల పీఎండీఎస్-హాఫ్ మూన్ పద్ధతుల్లో సేద్యం చేపట్టాలన్నారు.

**ప్రాంతీయ అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో 'పూర్వోదయ' పథకం కింద సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, గోదాముల వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు సీఎం వివరించారు. దీనికి తోడు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు వద్ద 'కోకో సిటీ' ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

అలాగే, జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ నిర్మాణాన్ని పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు తక్షణమే రూ.3 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాయలసీమలో పండే అరటికి ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు క్లస్టర్ల వారీగా ప్రణాళికలు రూపొందించి, రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు.

## ఆక్వా రైతులకు భారీ ఊరట

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తూ ఆక్వా రైతులకు భారీ ఊరట కల్పించారు. కొత్త ఆక్వా కనెక్షన్లకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఇస్తున్న విద్యుత్ సబ్సిడీని కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకు కూడా వర్తింపజేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే 50 వేల కనెక్షన్లకు ప్రభుత్వం ఏటా రూ.1,100 కోట్ల సబ్సిడీ భరిస్తోందని, తాజా నిర్ణయంతో మరో రూ.188 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఆక్వా సాగవుతున్న 4 లక్షల ఎకరాలనూ ఆక్వా జోన్ పరిధిలోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఆక్వా రంగాన్ని 'బ్లూ ఎకానమీ'గా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. నాణ్యత ధృవీకరణ, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. సముద్ర తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రూ.240 కోట్ల వ్యయంతో 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించి స్థానిక మత్స్యకారుల ఆదాయం పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 90 నియోజకవర్గాల్లో ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసి, 'డిజి రైతు బజార్' యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**మొదటిపేజీ తరువాయి**

రాజమండ్రి రూరల్ మండలం, రాజవోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ జరుగుతున్న పన్నుల వసూలు విధానాన్ని పరిశీలించారు. పన్నులను ఆన్లైన్లో కడుతున్న వారితో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "కటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంతో పని చేస్తుంది. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేస్తుంది. పంచాయతీలు స్వావలంబన సాధించాలంటే, ఆర్థికంగా వృద్ధి చెందాలి. స్వయంగా ఆదాయం ఆర్జించే స్థాయికి పంచాయతీలు రావాలి. ప్రతి అభివృద్ధి పనికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంతంగా అభివృద్ధి చేసుకునే దశకు పంచాయతీలు రావాలి. దీనికోసం ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోంది. నూతన విధానాలను పంచాయతీలు కడా అందిపుచ్చుకొని, పన్నులు గ్రామ ప్రగతికి పునాదులు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి" అన్నారు. పవన్ కళ్యాణ్ గారి వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఉన్నారు.

**ఆవ ఛానెల్ పరిశీలన**

రాజవోలు గ్రామపంచాయతీ నుంచి తిరిగి వస్తూ పవన్ కళ్యాణ్ రాజమండ్రిలో కీలకమైన ఆవాఎల్ చానల్ ను పరిశీలించారు. ఎస్టీపీ నుంచి వచ్చే ఈ ఛానెల్ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి ఉండటంపై పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ మతి కీర్తి చేకరి,



జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ లను పిలిచి కాలువలో వ్యర్థాలు పేరుకుపోకుండా, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో స్వచ్ఛరథాలు మాదిరిగా అర్బన్ ప్రాంతాల్లో కడా ప్రత్యేకంగా ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎందుకు పేరుకు పోతున్నాయనే విషయం మీదా, ఆ సమస్య మీద ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. దీనికి ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందుతుందని, వెంటనే ఛానల్ సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**- గోదావరి పరీవాహకంలో కాలుష్య నివారణకు రూ.100 కోట్లు**

కృష్ణా, గోదావరి నదులను కాలుష్యం నుంచి రక్షించడానికి, వాటిని శుభ్రపరచడానికి మిషన్ క్లీన్ కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు చేపట్టారు. అయితే అనుకున్నంత స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని గుర్తించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నదీ జలాలు కాలుష్యం బారిన పడకుండా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నిధుల ద్వారా మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా కాలువల్లో కలకవకుండా నిరోధించడానికి ఉపయోగిస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు. నది, కాలువల్లోకి వెళ్లే మురికినీటిని శుద్ధి చేయడానికి ఎస్టీపీలను ఏర్పాటు చేయడం వంటి పనులను ఈ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు.

**వుడ్ బ్యాంక్ కోసం పంచాయతీరాజ్ - అటవీ శాఖ మధ్య అవగాహన ఒప్పందం**

వుడ్ బ్యాంక్ కింద మొక్కలు కొనుగోలు చేయడానికి పంచాయతీరాజ్ - అటవీ శాఖల అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్లను పంచాయతీరాజ్ శాఖ వారు అటవీ శాఖకు ఇస్తారు. అందుకు సంబంధించి అటవీ శాఖ కలపను త్వరగా ఇచ్చే మొక్కలను అందిస్తుంది. వాటితో పంచాయితీల్లో పల్లె వనాలు అభివృద్ధి చేస్తారు. అక్కడ వచ్చే కలపను అటవీ శాఖ కొనుగోలు చేసి వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా అటు పంచాయతీలకు ఆదాయ ఆర్జన సాధ్యమవుతుంది, ఇటు పర్యావరణం మెరుగవుతుంది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై పీసీసీఎఫ్ చలపతి రావు, పి ఆర్ ఆర్డీ కమిషనర్ కృష్ణ తేజ సంతకాలు చేశారు.

# ఈడీ విచారణకు
## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్య, కుమారుడు

**లిక్కర్ స్కామ్ లో విచారణ వేగవంతం చేసిన ఈడీ**

**ఈడీ అధికారులకు తమ ఆస్తుల వివరాలను అందించామన్న మోహిత్ రెడ్డి**

**తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమేనని వ్యాఖ్య**

**అమరావతిమే 26ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై దృష్టి సారించిన ఈడీ... వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఈరోజు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈడీ అధికారులు అడిగిన తమ ఆస్తుల వివరాలన్నింటినీ పూర్తిస్థాయిలో అందజేశామని, దర్యాప్తుకు తమ వంతుగా పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప... అందులో ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. ఏపీ సిట్ కేవలం కక్షపూరితంగానే తమపై కేసులు నమోదు చేసిందని ఆయన ఆరోపించారు. ముడుపుల సొమ్ముతో తాము ఆస్తులు కొనుగోలు చేశామనే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, ఈ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. తాము సంపాదించిన ప్రతి పైసా సక్రమమైనదేనని పేర్కొన్నారు.

# శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..

**ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన**





**ఢిల్లీ మే 26ఆంధ్ర ప్రగతి**

కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరఫున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము ఆణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు

వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**మేడ్చల్‌మే 26ఆంధ్ర ప్రగతి**

మైనర్ బాలికపై లైంగికదాడికి సంబంధించి పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ జిల్లా కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరురోజులపాటు తమకు అప్పగించాలంటూ నాలుగు రోజుల క్రితం సిట్ అధికారులు కోర్టులో ఫిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సిట్ పిటిషన్‌పై విచారించిన కోర్టు బుధవారం నుంచి పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం ఆయన్ను చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. కూకట్‌పల్లిలోని సిట్ కార్యాలయంలో రీతూరాజ్ నేతృత్వంలో దర్యాప్తు బృందం విచారించనుంది. ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం రూపొందించింది. మైనర్ బాలికపై లైంగికదాడితోపాటు వారి మధ్య జరిగిన ఫోన్ చాటింగులను భగీరథ్ డిలీట్ చేయడం, బాలికకు రూ. 50వేలు ఇచ్చాను అని ఆయన చేసిన ప్రకటనపై సిట్ మరింత లోతుగా విచారించనున్నట్టు తెలిసింది. లైంగికదాడి ఆరునెలల క్రితం జరిగినట్టు భగీరథ్ పేర్కొంటున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఆధారాలను సేకరించనుంది. మైనర్ బాలిక తల్లి వాగ్మూలాన్ని పూర్తిగా క్రోడికరించి, భగరీథ్ నుంచి అదనపు సమాచారాన్ని , నిజాలను వెలికి తీసేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మొత్తం మీద సిట్ అధికారుల విచారణలో నిందితుడు ఏమేరకు అంగీకరిస్తారనే కోణంలో ఇటు రాజకీయ వర్గాలు, అటు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో చూడాల్సిందే.

# పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేటినుంచి టిడిపి మహానాడు

**మొదటిపేజీ తరువాయి**

సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో

అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 27 మే 2026

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికీ గొడ్డలి పార్టీనే.

## ..జగన్ మోహన్ రెడ్డి వి ముమ్మాటికి అరాచక, గొడ్డలి రాజకీయాలే.!

### -జిల్లా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ మరియు జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**
నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో ఖండించారు . జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికి గొడ్డలి పార్టీయేనని అన్నారు.
ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు. “మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి ఏం చేశావ్ జగన్?“ అని ఆయన ప్రశ్నించారు. వైకాపా పాలనలో ఎన్ని గ్రామాల్లో రాజకీయ హత్యలు జరిగాయో తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, వాటిని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని జగన్ కు బహిరంగ సవాల్ విసిరారు. జగన్ హయాంలో ఎంత మంది రౌడీ షీటర్లను పెంచి పోషించారో ప్రజలందరికీ తెలుసన్నారు. వైకాపా అరాచకాలను భరించలేకనే ప్రజలు గత ఎన్నికల్లో 151 స్థానాల నుండి 11 స్థానాలకు పరిమితం చేసి బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే ‘ప్రజా వేదిక‘ను కూలుస్తానని బహిరంగంగా ప్రకటించడంలోనే జగన్ లోని క్రూరత్వం బయటపడిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. దేశంలో ప్రధానమంత్రికి కూడా లేని విధంగా ఇనుప కంచెల భద్రతను ఏర్పాటు చేసుకున్నారంటే, జగన్ ఎంతటి అభద్రతా భావంతో ఉన్నారో అర్థమవుతోందన్నారు. రాజా రెడ్డిలో ఉన్న క్రూర స్వభావాలన్నీ జగన్ కు వచ్చాయని, ఇప్పటికీ బెదిరించే




ధోరణిలోనే మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని తగ్గించడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, జగన్ మాత్రం పరిశ్రమలను మరియు పెట్టుబడిదారులను బెదిరిస్తూ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 17 ఏళ్ల క్రితం రాజశేఖర్ రెడ్డి చనిపోతే ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమని, గత ఐదేళ్ల మీ ప్రభుత్వంలో మీ సొంత కుటుంబంలో జరిగిన హత్యలపై ఎందుకు విచారణ జరిపించలేకపోయారని ప్రశ్నించారు. ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు. హత్య రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన జగన్ కు తమ పార్టీని విమర్శించే అర్హత లేదన్నారు. చివరకు పత్రికా ప్రతినిధులపై కూడా దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ సొంత బాబాయిని చంపిన గొప్ప ఘనత జగన్ కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాయలసీమ ప్రాంతానికి ఫ్యాక్షనిజం, అరాచకాలను పరిచయం చేసిన చరిత్ర జగన్ సొంత కుటుంబానిదన్నారు. జగన్ తీరు ఇలాగే ఉంటే రాబోయే ఎన్నికల్లో వైకాపాకు సింగిల్ డిజిట్ స్థానాలు కూడా రావని జోస్యం చెప్పారు. అలాగే, తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్లలో ‘మహానాడు‘ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మరియు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.ఈ సమావేశంలో నందికొట్కూరు టిడిపి ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మంచాలకట్ట శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మే 26:**
పేద ప్రజలు ఆపదలో ఉంటే ‘నేనున్నాను’ అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయం నందు 37 మంది లబ్ధిదారులకు 16 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, వారి




స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు నాకు విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 37 మందికి వచ్చిన 16 లక్షల 4 వేల రూపాయలను చెక్కుల రూపంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

# శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా బక్రీద్ పండుగను జరుపుకోవాలి.

### -.జిల్లా వ్యాప్తంగా గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక చెక్పోస్టుల ఏర్పాటు.

### -ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు. -జిల్లా ఎస్పీసునీల్ షోరాణ్.

### -నోడల్ అధికారిగా అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్ బాబు నియామకం (ఫోన్ నెం: 9154980854).

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 26:**
రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట అమలు మరియు సామాజిక సామరస్యాన్ని పటిష్టం చేయడం కోసం నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ జిల్లా ముస్లిం సోదరులకు ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. -ఈ పండుగ కాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించేందుకు నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు ని నోడల్ అధికారిగా నియమించారు. జిల్లాలో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా నోడల్ అధికారి ఫోన్ నెంబర్ 9154980854 కు సమాచారం అందించాలని ఎస్పీ గారు కోరారు.

**- పోలీస్ శాఖ జారీ చేసిన ముఖ్యమైన సూచనలు/మార్గదర్శకాలు**

- అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా బక్రీద్ సందర్భంగా పశువులను అక్రమంగా రవాణా చేసే అవకాశాలు ఉన్నందున జిల్లా సరిహద్దుల్లో, ముఖ్య ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిఘా ఉంచడం జరిగింది.
- తనిఖీల తీవ్రతరం: అనుమానాస్పద ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, షెడ్లు, ఫారంహౌస్‌లలో అక్రమంగా పశువులను దాచిపెట్టినట్లు సమాచారం వస్తే తక్షణమే



తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

**- గోవధ నిషేధ చట్టాల కఠిన అమలు**
గోవధ రాష్ట్ర చట్టాల ప్రకారం గోవధ నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుంది.

**- జంతు క్రూరత్వ నిరోధక చట్టాల అమలు:**
అనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియామార్గదర్శకాల ప్రకారం జంతువుల పట్ల క్రూరంగా ప్రవర్తించడం, అమానుషంగా రవాణా చేయడం, హింసించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**– ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదు:**
ఏవైనా అనుమానాస్పద రవాణా లేదా కార్యకలాపాలు గమనిస్తే ప్రజలు స్వయంగా అడ్డుకోవడం, వాహనాలను ఆపడం చేయరాదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదు.

**- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా:**
తప్పుడు ప్రచారాలు, వదంతులు, పాత వీడియోలు/ఫోటోలను షేర్ చేస్తూ మత సామరస్యానికి భంగం కలిగించే వారిపై సైబర్ వింగ్ ద్వారా నిరంతర నిఘా ఉంటుంది. అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయి.

**- సున్నిత ప్రాంతాల్లో బీట్ బందోబస్తు:**
జిల్లా వ్యాప్తంగా కమ్యూనల్ సెన్సిటివ్ ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, మార్కెట్ ప్రాంతాలలో పోలీస్ సిబ్బందితో నిరంతర నిఘా మరియు బీట్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

**- మత పెద్దలతో సమన్వయం:**
శాంతియుత వాతావరణం కోసం ఇప్పటికే మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి వారి సహకారాన్ని కోరడం జరిగింది.

**- ముగింపు హెచ్చరిక:**
జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించినా, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే విధంగా ప్రవర్తించినా, చట్టాన్ని ఉల్లంఘించినా ఎవరినీ ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు.

# శుభకార్యాలప్పుడు ‘అన్న క్యాంటీన్ల’కు విరాళాలు ఇవ్వండి.

### ..పేదవారికి అన్నం పెట్టడంలో నిజమైన సంతృప్తి.

### ..నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు.

### మధ్యాహ్న భోజనానికి విరాళం ఇచ్చిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లోకేష్

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ మే 26:**
కుటుంబ శుభకార్యాలు, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, స్మారక దినాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ‘అన్న క్యాంటీన్ల’కు విరాళాలు అందించి పేదలకు అన్నదానం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు నగర ప్రజలకు పిలుపునిచ్చారు. సమాజంలోని నిరుపేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణలో సంపన్నుల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.



మంగళవారం కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేదవారికి అన్నం పెట్టడంలో లభించే ఆనందం, సంతృప్తి ఎంతో గొప్పదని తెలిపారు. నగరంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు తోడ్పాటు అందించాలని కోరారు. అన్న క్యాంటీన్లలో అల్పాహారం ఒక్కో ప్లేట్‌కు రూ.22 వ్యయం అవుతుండగా ప్రభుత్వం రూ.17 సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. అలాగే మధ్యాహ్న, రాత్రి భోజనానికి ఒక్కో ప్లేట్‌పై రూ.34 వ్యయం అవుతుండగా ప్రభుత్వం రూ.29 సబ్సిడీ భరిస్తోందన్నారు. అందరి సహకారంతో మరింత మందికి భోజన సేవలు అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు. నగరంలో 6 అన్న క్యాంటీన్లు ఉన్నాయని, ఒకరోజు ముందే విరాళం చేస్తే, దాత కోరిన రోజు భోజనం అందిస్తామని పేర్కొన్నారు. ఎక్కువ మొత్తంలో చెల్లించే దాతలు నగరపాలక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.విరాళాలు అందించే దాతల వివరాలను అన్న క్యాంటీన్ స్క్రీన్‌లో ప్రదర్శించడంతో పాటు ప్రభుత్వం అభినందన సర్టిఫికెట్ అందజేస్తుందని తెలిపారు. కమిషనర్ పిలుపు మేరకు నగరపాలక సంస్థ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ తన తల్లి స్మారకార్థం అన్న క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా అందించారు. దీంతో అతన్ని కమిషనర్ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు కొనసాగుతున్న హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం.

### ..పోలీసుల మానసిక ప్రశాంతతకే ‘హార్ట్‌ఫుల్‌నెస్’ మెడిటేషన్.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ మే 26:**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో, రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ కోసం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కొనసాగింది.పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన చేశారు.పోలీసు విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళనలను తగ్గించేందుకు యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడతాయని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎఓ మాధవి, సిఐ తిక్కస్వామి, డిఐజి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

### -38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**
ఈనెల 26 27 తేదీలలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ పండగలు జరుపుకోవాలని వైయస్సార్ నగర్ 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు అన్నారు.2026 మే నెల 27,28వ తేదీన నిర్వహించే మహానాడు కార్యక్రమం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో పొదుపు చర్యలో భాగంగా ఆన్లైన్ లో మహానాడు వేడుక నిర్వహించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ఈ కార్యక్రమంలో



భాగంగా నంద్యాలలో మంత్రి ఎన్ ఎండి.ఫరూక్,వారి కుమారులు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి.ఫిరోజ్, ఎన్ ఎండి.ఫయాజ్ ఆధ్వర్యంలో అన్ని క్లస్టర్ పరిధిలో డిజిటల్ మహానాడు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా క్లస్టర్ 9 ఇంచార్జి గోవింద నాయుడు ఆధ్వర్యంలో నంద్యాల నందమూరి నగర్ లోని గోపిశెట్టి కల్యాణ మండపం నందు ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మండల కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులు, క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్, కో యూనిట్, బూత్ కన్వీనర్, కో కన్వీనర్లు, గ్రామ / వార్డు కమిటీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పక ప్రతి ఒక్కరు కూడ హాజరు కావాల్సిందిగా ఆదేశించడమైనది.

# మహానంది మండలంలో జీలుగ విత్తనాల పంపిణీ :ఏవో నాగేశ్వర్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి మహానంది మే 26:**
మహానంది మండలంలో మంగళవారం నుంచి జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీకి పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఏవో మాట్లాడుతూ.. జీలుగలు కేజీ రూ.160 కాగా అందులో సబ్సిడీ పోగా రైతు కేజీకి రూ.80 చెల్లించవలసి ఉంటుందన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ లింక్ ఫోను నెంబర్తో సంబంధిత రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు. జీలుగ కావలసిన రైతులు బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్ర వేయవలసి తీసుకోవాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# కార్డుదారులందరికీ సమయానికి నాణ్యత తో రేషన్ సరుకుల పంపిణీ.

**..అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు.**

**..దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయాలి.**

**..డెలివరీ బాయ్స్ గ్యాస్ సిలిండర్ కు అదనంగా డబ్బు వసూలు చేయకూడదు.**

**..జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 26:** జిల్లాలో చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులందరికీ రేషన్ సరుకులు నాణ్యంగా, సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో రేషన్ బియ్యం పంపిణీ, ఈ–పోస్ యంత్రాల పనితీరు, ఎఫ్.పి. షాపుల నిర్వహణ, అక్రమ రవాణా నివారణ చర్యలు, అర్హులందరికీ సరుకుల పంపిణీ, దీపం పథకం అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులందరికీ సకాలంలో నాణ్యమైన సరుకులు అందించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సరుకులు సకాలంలో అందుతున్నాయా? నాణ్యత ఎలా ఉంది? ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నారా? వంటి అంశాలపై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తోందన్నారు.ప్రజలకు సరుకులు సక్రమంగా, సమయానికి అందడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యతతో కూడిన సరుకులు అందించడమే లక్ష్యమని, ఎవరూ డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు. అక్రమాలు ఎక్కడైనా జరుగుతున్నట్లయితే ప్రజలు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేషన్ పంపిణీ ప్రతి నెల 1వ తేదీ నుంచి 10 లేదా 12వ తేదీలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులకు ప్రతి నెలా 25 వ తేదీ నుంచి వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించడం జరుగుతోందన్నారు. ఎఫ్.పి. షాపుల విషయంలో కూడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఏదైనా షాప్‌పై చర్యలు తీసుకోవాల్సి వచ్చినా ప్రజలకు సరుకుల పంపిణీ ఆగకుండా పక్క షాపులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సరఫరా కొనసాగించే విధంగా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ ప్రతి ఎఫ్.పి. షాప్‌లో ఎంత శాతం పంపిణీ పూర్తయింది, ఎంత నిల్వ ఉంది వంటి వివరాలను నిరంతరం పరిశీలిస్తున్నామని చెప్పారు.. అలాగే దీపం పథకంలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యంగా ఆదోని డివిజన్ పరిధిలో ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. కొంతమంది డీలర్లు ఉచితంగా ఇవ్వాల్సిన సిలిండర్లపై అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు నిర్వహించి జరిమానాలు కూడా విధించామని వెల్లడించారు. . దీపం పథకం అమలులో భాగంగా డెలివరీ బాయ్స్ ప్రవర్తనపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇప్పటికే 14 మంది డెలివరీ సిబ్బందిపై చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే ప్రజల సహకారం కూడా చాలా అవసరమని తెలిపారు. సరైన సేవ అందితే అందిందని, సమస్య ఉంటే సమస్య ఉందని ప్రజలు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ కు అదనంగా డబ్బు వసూలు చేయకూడదని తెలిపారు. సిలిండర్ అందచేసే సమయంలో ప్రజలతో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించేలా ఏజెన్సీ లు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం పూర్తి స్థాయిలో చేరేలా అధికారులు, డీలర్లు, ఏజెన్సీలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని కలెక్టర్ సూచించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... విజిలెన్స్ కమిటీ సభ్యులు ముఖ్యంగా రెండు అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మొదటిగా, అర్హులైన రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు సమయానికి, పూర్తి స్థాయిలో అందుతున్నాయో లేదో పర్యవేక్షించాలని, రెండవదిగా ప్రజలకు పంపిణీ చేయాల్సిన సరుకులు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమంగా మళ్లింపుకు గురికాకుండా చూడాలని తెలిపారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా, వాటిని విజిలెన్స్ కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కార చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న హోమ్ డెలివరీ సదుపాయం అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా ఆ సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ రవాణా, రేషన్ సరుకుల డైవర్షన్‌పై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమ రవాణా గుర్తించిన వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఆరు నెలలుగా పెద్ద ఎత్తున కేసులు నమోదు చేస్తున్నామని, ప్రతి వారం 15 నుండి 20 కేసుల వరకు విచారణ చేపడుతున్నామని వెల్లడించారు. గతంలో సీజ్ చేసిన వాహనాలపై కూడా విచారణ పూర్తయ్యాక సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి వాహనాలను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం ఈ కేసులపై ప్రత్యేక విచారణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఆదోని, పత్తికొండ ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరుగుతోందని మీడియాలో వచ్చిన కథనాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని, సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరమైన చోట 6–ఏ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విజిలెన్స్ కమిటీలలో నాన్–అఫిషియల్ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఉద్దేశం ప్రజల్లో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమేనని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అధికారులు గుర్తించలేని సమస్యలను ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వినియోగదారుల ప్రతినిధులు తెలియజేస్తే సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. డీలర్స్ అసోసియేషన్, ఎన్జీవోలు, వినియోగదారుల సంఘాలు తదితర వర్గాల ప్రతినిధులతో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా, రేషన్ సరుకులు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, పోలీసు శాఖ సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.. గత కొద్ది నెలల క్రితం ఆదోని ప్రాంతంలో నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి దశలో కట్టుదిట్టమైన నిఘా అవసరమని తెలిపారు. చెక్‌పోస్టులు, రైస్ మిల్లులు, గోదాములు, రవాణా మార్గాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం రేషన్ సరుకులు పంపిణీ, గ్యాస్ సిలిండర్ల సరఫరా అంశాలపై కమిటీ సభ్యులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి.

**..ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వసతి గృహాల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి.**

**..మియావాకి విధానంలో హైడెన్సిటీ, అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లు చేపట్టాలి. ..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 26:** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల అమలు, నెట్ జీరో,హెల్తీ క్యాంపస్ సంబంధిత అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు పర్యావరణ హిత కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని తెలిపారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచాలని సూచించారు. మియావాకి విధానంలో హైడెన్సిటీ మరియు అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పావు ఎకరా (25 సెంట్లు) విస్తీర్ణంలో ఏడు లేయర్ల విధానంలో సుమారు 1625 మొక్కలను నాటేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఇందులో సుమారు 125 చిన్న మొక్కలు, 100 పెద్ద మొక్కలు చొప్పున కలిపి వివిధ రకాల మొక్కలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 425 రకాల మొక్కలతో జీవ వైవిధ్యాన్ని పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో పావు ఎకరా స్థలం అందుబాటులో ఉన్న ప్రాంతాలను వెంటనే గుర్తించి పనులు ప్రారంభించాలని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో వారి అవసరాలకు అనుగుణంగా ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 నాటికి అన్ని స్థలాలను గుర్తించి, మొక్కలను సిద్ధంగా ఉంచి విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమగ్ర కార్యాచరణ ఉండాలని తెలిపారు.నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు,గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన ప్రదేశాల్లో ఈ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, శుభ్రత, పునరుత్పాదక శక్తి వినియోగం వంటి అంశాలను సమన్వయం చేస్తూ జిల్లాను ఆదర్శ నెట్ జీరో జిల్లా దిశగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

# నంద్యాల ట్రాఫిక్ పోలీసులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కొరకు వేసవి కిట్లు పంపిణి

**..నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ మే 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేసవి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది.తీవ్రమైన ఎండ వేడిమిలోనూ రోడ్లపై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య రక్షణకై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులకు ఎండ వేడి నుండి కాపాడుకునేందుకు అవసరమైన రక్షణ సామాగ్రిని పంపిణీ చేశారు.ట్రాఫిక్ సిబ్బందికి కింది రక్షణ వస్తువులు అందించడం జరిగింది. యూవీ ప్రొటెక్షన్ గాగుల్స్ సూర్యుని హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి కళ్ళను కాపాడేందుకు.క్యాప్స్ తల మీద నేరుగా పడే ఎండ వేడిమిని నివారించేందుకు...వాటర్ బాటిల్స్ నిరంతరం నీళ్ళు తాగుతూ డీహైడ్రేషన్‌ను అడ్డుకునేందుకు... ఫేస్ మాస్కులు వాహనాల నుండి వెలువడే ధూళి, కాలుష్యం నుండి శ్వాసవ్యవస్థను రక్షించుకునేందుకుఈ సంధర్భంగా ఎస్పీ ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమం గురించి ముందుగా తెలుసుకోవడంతో పాటు, నంద్యాల పట్టణ కేంద్రంలో వివిధ ప్రధాన కూడలలో వారు చేయుచున్న విధుల గురించి ఆరా తీయడం జరిగింది. “తీవ్రమైన ఎండల్లోనూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య విషయంలో ప్రత్యక శ్రద్ధ తీసుకోవాలని అది సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది అనంతరం వారికి వేసవి రక్షణ కిట్లను అందజేస్తూ విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి శ్రీమతి ఎం. జావళి పాల్గొని సిబ్బందికి వస్తువులను అందజేస్తూ వారి సేవలను అభినందించారు.

# అందరూ ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**ఎటువంటి పుకార్లు, వదంతులను నమ్మవద్దు -అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా**

**కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్**



**కర్నూలు క్రైమ్ మే 26ఆంధ్ర ప్రగతి**

మే 28న జరగనున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు.కర్నూలు ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వాహనాలను పూర్తిగా తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని ఉల్చాల రోడ్డు వై జంక్షన్ వద్ద కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.ఏపీఎస్పీ 2వ బెటాలియన్, ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.అలాగే అసాంఘిక కార్యకలాపాలపై లాడ్జీలలో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలంతా ఐక్యమత్యంతో శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, ఎటువంటి పుకార్లు, వదంతులను నమ్మవద్దని సూచించారు.అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అనుమానాస్పద రవాణా లేదా అక్రమ కార్యకలాపాలపై వెంటనే డయల్ 112, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర చైర్మన్ గుడిపూడి నారాయణస్వామి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని, నంద్యాలలోని వారి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర చైర్మన్, నంద్యాల నియోజకవర్గ అబ్జర్వర్ గుడిపూడి నారాయణస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ కి గుడిపూడి నారాయణస్వామి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నంద్యాల నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ, సామాజికాంశాలతో పాటు, విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) మరియు వయోవృద్ధుల సంక్షేమ పథకాల అమలుతీరుపై వారు కాసేపు చర్చించారు.ఈ మర్యాదపూర్వక భేటీలో పలువురు స్థానిక నాయకులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# డిజిటల్ విప్లవానికి వేదికైన మంగళగిరి

## నేటి నుంచే 'హైబ్రిడ్' మహానాడు

2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్ ప్రకటించనున్న చంద్రబాబు

రెండు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడు

ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్, ఫిజికల్ పద్ధతిలో నిర్వహణ

'స్త్రీ శక్తి' ప్రధాన ఇతివృత్తంగా తీర్మానాలు, చర్చలు

2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్, కార్యకర్తలకు దిశానిర్దేశం

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌కు ఇదే తొలి మహానాడు




తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ, పసుపు పండగ "మహానాడు-2026" నేటి నుంచి (మే 27) అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానుంది. ఈ ఏడాది మహానాడు రాజకీయ చరిత్రలోనే సరికొత్త అధ్యయనానికి నాంది పలుకుతోంది. తొలుత నెల్లూరు జిల్లాలో భారీ బహిరంగ సభగా నిర్వహించాలని భావించినప్పటికీ, ప్రపంచవ్యాప్త అనిశ్చితులు మరియు ప్రభుత్వ ప్రజా ధన వ్యయ నియంత్రణ (ఆర్థిక పొదుపు) పిలుపునకు మద్దతుగా పార్టీ అధినాయకత్వం ఈసారి సరికొత్త నిర్ణయం తీసుకుంది. సాంకేతికతను జోడించి ఈ వేడుకను "మెగా డిజిటల్ హైబ్రిడ్" రూపంలో నిర్వహిస్తున్నారు.

**-1,848 క్లస్టర్ కేంద్రాలతో డిజిటల్ అనుసంధానం**

-మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం ప్రధాన వేదికగా ఈ రెండు రోజుల (మే 27, 28) మహానాడు సభలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం, మండలం పరిధిలో 1,848 డిజిటల్ క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**-లైవ్ ఇంటరాక్షన్:**
ప్రధాన వేదికపై ఉండే పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌లతో క్లస్టర్ కేంద్రాల్లోని కిందిస్థాయి కార్యకర్తలు నేరుగా మాట్లాడేలా భారీ వాజుణ స్క్రీన్లు, టూ-వే కమ్యూనికేషన్ వ్యవస్థను సిద్ధం చేశారు.

**డిజిటల్ హాజరు:**
ఈ సభకు హాజరయ్యే లక్షలాది మంది ప్రతినిధులు, కార్యకర్తల హాజరును 'ఋణ్రా' మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్నారు.
-సమయపాలన: రెండు రోజుల పాటు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు నిరంతరాయంగా ఈ సెషన్లు సాగనున్నాయి.

**-ముఖ్యమైన అజెండా:**
"స్త్రీ శక్తి"కి అగ్రతాంబూలం
-ఈ ఏడాది మహానాడు ప్రధానంగా మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించింది. "స్త్రీ శక్తి" అనే ప్రధాన థీమ్‌తో ఈ సదస్సు సాగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు, భవిష్యత్తు కార్యాచరణపై ఇందులో సుదీర్ఘంగా చర్చించనున్నారు.

**అమరావతిమే 26ఆంధ్ర ప్రగతి**

తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పండుగలాంటి మహానాడుకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఓ సంప్రదాయంగా, చారిత్రక అవసరంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్, 2026 సంవత్సరానికి సరికొత్త రీతిలో, నూతన ఉత్తేజంతో జరగనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు అమరావతి కేంద్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 'స్త్రీ శక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఈ మహానాడును తీర్చిదిద్దారు. 44 ఏళ్ల పార్టీ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను నెమరువేసుకుంటూ, వర్తమాన రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకుని, 2029 ఎన్నికల లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణకు పదునుపెట్టేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు. ఈ మహానాడు వేదికగా వచ్చే ఎన్నికలకు చంద్రబాబు రోడ్ మ్యాప్ ప్రకటించనున్నారు.

**వర్చువల్, ఫిజికల్ కలయికతో వినూత్నంగా...**

ఈసారి మహానాడు నిర్వహణలో టీడీపీ వినూత్న పంథాను అనుసరిస్తోంది. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీనికి అనుగుణంగా, భారీ జన సమీకరణకు బదులుగా ఇంధనాన్ని ఆదా చేసే లక్ష్యంతో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు భౌతికంగా పాల్గొంటాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 1,800కు పైగా క్లస్టర్ల నుంచి వర్చువల్‌గా




పాలుపంచుకుంటారు. ఈ క్లస్టర్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలోనూ పండుగ వాతావరణం ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**20 తీర్మానాలు... 2029కి రోడ్‌మ్యాప్**

రెండు రోజుల మహానాడులో మొత్తం 20 తీర్మానాలపై చర్చించి ఆమోదించనున్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినవి 10, తెలంగాణకు 4, అండమాన్‌కు 1, ఉభయ రాష్ట్రాలకు వర్తించేవి 4 ఉన్నాయి. చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా 2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేసేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను ఈ మహానాడు వేదికగా ఆవిష్కరించనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడం కూడా ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాల్లో ఒకటి.

**నాయకుల ప్రసంగాలు... లోకేష్‌పై ప్రత్యేక ఆసక్తి**

తొలి రోజు ఉదయం 9 గంటలకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మహానాడును ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభోపన్యాసం చేస్తారు. పార్టీ ఆర్థిక వ్యవహారాల నివేదికను సమర్పించిన తర్వాత, చంద్రబాబు కార్యకర్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేస్తారు. 'స్త్రీ శక్తి', 'కార్యకర్తే అధినేత', 'పేదల సేవ' వంటి అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు.
రెండో రోజు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయి. 'తెలుగుజాతి విశ్వఖ్యాతి', 'అన్నదాతకు అండగా', 'విధ్వంసం నుంచి వికాసం వైపు', 'సంపద సృష్టి' వంటి పలు కీలక అంశాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయి. చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో మహానాడుకు తెరపడుతుంది.
ఈ మహానాడులో మరో ప్రత్యేక ఆకర్షణ నారా లోకేష్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన పాల్గొంటున్న తొలి మహానాడు ఇదే కావడంతో, ఆయన ప్రసంగంపై పార్టీ శ్రేణుల్లోనే కాక, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది. యువతకు, కార్యకర్తలకు ఆయన ఎలాంటి దిశానిర్దేశం చేస్తారనేది ఉత్కంఠగా మారింది. మొత్తంగా ఈ మహానాడు ద్వారా పార్టీలో నూతనోత్తేజం నింపి, రాబోయే రాజకీయ సవాళ్లకు పటిష్టమైన వ్యూహంతో సిద్ధం కావాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది.

